
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# -58-
## మోడీలో చెవిలో తెలుగు పువ్వు? ఏమో?

అసలు ఈ 'చెవిలో పువ్వు' అనే నానుడి ఎప్పుడు మొదలయిందో, ఎలా మొదలయిందో నాకు తెలియదు. దీనికి పురాణాలలో ఏమైనా మూలాలు ఉన్నాయా, లేక "సుత్తి కొట్టడం" లాగా జంధ్యాల మార్క్ సరికొత్త ప్రయోగమేమో కూడా నాకు తెలీదు. కానీ నిన్న ఒక తెలుగు టీవీలో ఒక వార్తా ప్రసారం చూడగానే టక్కున నా చెయ్యి నా చెవుల వేపు వెళ్ళిపోయింది. 'అరెరె" అనుకుని వాటిని వెనక్కి లాగేసుకోగానే రెండు పువ్వులూ నాకేసి వెక్కిరింతగా చూశాయి. అందులో ఒక పువ్వేమో కాలీ ఫ్లవరు, రెండోది అదే సైజులో కేబేజీ....అంటే ఇదేదో దేవుడి పూజ చేసి రెండు పువ్వు రేకులు మనంతట మనమే భక్తితో చెవిలో దోపుకున్న బాపతు కాదు. ఎవరో కావాలని మన చెవిలో పెట్టిన పెద్ద పువ్వు అనమాట. నిజానికి ఆ పువ్వులు ఎక్కడో అమెరికాలో కూచున్న నా చెవిలో పెట్టినవి కాదు. పవిత్ర భారత దేశం ప్రధాన మంత్రి లేదా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులవి. కొండొకచో వారందరూ కలిసి తెలుగు భాష మొత్తానికే పెడుతున్న చెవిలో పువ్వులు!.

అసలు ఏం జరిగిందీ అంటే...


మొన్నీ మధ్య జిల్లాల వారీగా ఎన్ని హత్యలు, ఎన్ని మానభంగాలు జరిగాయో ఆ ఘోరమైన ఫోటోలూ, ఆమిక్రాన్ కేసులూ, ఏ మంత్రి ఎవరిని ఎలాంటి అలాంటి పదాలతో తిట్టారూ లాంటి రోజు వారీ వార్తలు విని తరిద్దాం అనుకుని తెలుగు టీవీ చూడడం మొదలుపెట్టగానే ఆ టీవీ "ఇక నుంచీ తెలుగులో ఇంజనీరింగ్ విద్యాబోధనకి ప్రభుత్వం అనుమతి" అని ప్రధాన వార్తగా వినగానే సోఫాలో హాయిగా వెనక్కి జార్లబడి కూచున్న నేను ఠకీమని లేచి కూచుని టీవీ వాల్యూమ్ పెంచేశాను. 'హమ్మయ్య. ఇన్నాళ్ళకి మేధావుల గోడు వినిపించి, నాయకులు కళ్ళు తెరిచి మాతృభాషకి గుర్తింపు ఇస్తున్నారహో" అని మహదానంద పడిపోయాను. మరి ప్రాధమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల దాకా తెలుగు మానేసి ఇంగ్లీష్ మీడియం పెట్టారు కదా...దాని సంగతి ఏమిటీ..అదంతా కేన్సిల్ చేసేశారా ఏమిటి కొంపతీసి? అని నా మెదడు గందరగోళం పడుతుండగా..."స్థానిక భాషలోనే విద్యాభ్యాసం కొనసాగాలి అనే ప్రధాని మోదీ గారి ఆదేశాల ప్రకారం దేశంలో 20 ఇంజనీరింగ్ కళాశాలలు మాతృభాషలో అన్ని సబ్జెక్ట్ లూ.....అంటే ఫిజిక్స్ కెమిష్ట్రీ లాంటివే

కాకుండా మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్స్ లాంటివీ కూడా బోధించడానికి అనుమతి ఇచ్చారు. వాటిల్లో తెలుగు రాష్ట్రాలకి చెందిన కళాశాలలకి అనుమతి లభించింది. ఇక నుంచీ ఇంజనీరింగ్ విద్యాబోధన తెలుగులో జరుగుతుంది అని యాజమాన్యం ప్రకటించింది". అని ఆ వార్తలు చదివే అమ్మాయి అందమైన 'జిడ్డు' మొహంతో.... అనగా భారీ మేకప్పు వెనకాల ఆ మొహం బాగానే ఉండీ ఉండవచ్చును కదా...అది మనకెందుకు కానీ ఆవిడ ఏ విధమైన భావ ప్రకటనా లేకుండా జనాంతికంగా ఆ వార్త చదివింది. దేశం మొత్తం మీద 20 అంటే బహుశా బెంగాల్, గుజరాత్, మరాఠీ, తమిళం మొదలైన భాషలలొ ఒక్కొక్కటీ, హిందీ వాళ్ళు ఎక్కువ కాబట్టి అందులో ఐదారు కళాశాలలలో నేను నేర్చుకున్న ఫ్లూయిడ్ మెకానిక్స్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, థెర్మో డైనామిక్స్, నేను నేర్చుకోలేక మానేసిన కోబాల్ ప్రోగ్రామింగ్, ఎస్సేపీ, ఆరేకిల్ లాంటివన్నీ ఆయా భాషల్లో నేర్పుతారు అనగానే ఎందుకో నాకు సంతోషం బదులు భయం వేసి గుండె దడదడ లాడింది. మూడో సారి దడ అనే లోపుగా టీవీలో ఇద్దరు పెద్ద మనుషులు తెరమీదకి వచ్చారు. ఒకాయన బాగా వెనకేసుకున్న విద్యా వ్యాపారి అనుకుంటాను. ఆ రెండో ఆయనని ప్రొఫెసర్ ఫలానా అని ఆ 'జిడ్డమ్మాయి' చెప్పింది కానీ నాకు మటుకు ఆయన ఏదో తాలూకా ఆఫీసులో గుమస్తాలాగా కనపడ్డాడు...చూడ్డానికే కాదు....నోరు విప్పాక కూడా అలాగే వినపడ్డాడు. ముందు ఆ తెలుగు మార్వాడీ గారు మాట్లాడుతూ "చాలా హేపీగా ఫీల్ అవుతున్నాను. మోదీ జిందాబాద్, వెంకయ్య నాయుడు గారూ జిందాబాద్, ఎన్వీ రమణ గారూ జిందాబాద్." అని శోభనం పెళ్ళి కొడుకులా అష్ట వంకర్లూ తిరిగిపోయి ఆ నాయకుల తెలుగు భాషాభిమానాన్ని పొగిడారు. ఇక ప్రొఫెసర్ గుమాస్తా గారు నిలువుగా వేళ్ళాడుతూ కట్టుకోవలసిన 'కంత లంగోటీ" ని మెడకి అడ్డంగా, బిగుతుగా కట్టుకుని, కొంచెం ఆయాసంగా "అవును. ఇప్పుడు తెలుగు మీడియం లో చదువుకున్న స్టూడెంట్స్ కి అర్థం అవడం కోసం మొదటి సంవత్సరం 75 శాతం పాఠం తెలుగులో ఉంటుంది కానీ టెక్నికల్ మాటలు అన్నీ ఇంగ్లీషు లోనే ఉంటాయి. రెండో ఏడు వాడుక భాషని 50 శాతానికి తగ్గిస్తాం. అలా తగ్గించుకుంటూ డిగ్రీ ఆఖరి సంవత్సరానికి విద్యార్థులు అందరికీ వాడుక భాష బదులు మొత్తం అంతా ఆంగ్లం లోనే ఆ ఇంజనీరింగ్ సబ్జెక్ట్స్ అన్నీ బోధిస్తాం. అప్పుడు నో మోర్ తెలుగు." అంటూ ఆయన తన ప్రవచనంతో తానే చంకలు గుద్దుకుంటూ మహదానంద పడిపోయాడు.

అప్పుడు ఆ టీవీ రిపోర్టర్ మైక్ ని ఆయన ధరించిన మాస్క్ మీద పెట్టి "కెన్ యు గివ్ ఎక్సాంపుల్, సర్" అని మార్వాడీని అడుగుటా, ఆ మార్వాడే మారుమాట్లాడకుండా ఆచార్య గుమాస్తా గారి కేసి వేలు చూపించుటా జరిగాయి. ఆచార్య గారు కాస్సేపు బుర్ర గోక్కుని "వాటర్ ఎప్పుడూ ఎక్కువ ప్రెషర్ ఉన్న సైడ్ నించి లోయర్ ప్రెషర్ ఉన్న వేపు ట్రావెల్ చేస్తుంది" అలాగనమాట...అని ఒక చిన్న ఉదాహరణ ఇచ్చాడు. నీరు ఎటునుంచి ఎటువేపు ప్రవహిస్తుందో జన్మలో అదే మొదటి సారి తెలుసుకున్న ఆ రిపోర్టర్ 'సూపర్ సర్" అనేసి "వాటర్ ఇండియా సరే సార్, మరి కంప్యూటర్ అమెరికా కదా సార్..అది ఎలా చెప్తారు సార్? " అని అమాయకంగా అడీగాడు. "ఓ, అది సింపుల్...ఫర్

ఎక్జాంపుల్..."మౌజ్ మీద రైట్ క్లిక్ చేస్తే ఓపెన్ అయిన ఆప్షన్స్ విండో లో డిలీట్ నొక్కితే అంతా గంగలో కలిసిపోతుంది" అని పాఠం చెప్పాం అనుకోండి, డాట్ స్ట్యూడెంట్ సీల్ నేవర్ గో టూ గేంజీస్" అని ఈయన కూడా హేపీగా ఫీల్ అయిపోయాడు. అది చాలదు అన్నట్టు పక్కనే చెట్ల కింద తారట్లాడుతున్న ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు ముందు కూడా మైక్ పెట్టి "మీరు ఎలా ఫీల్ అవుతున్నారు? అని అడిగాడు. అందులో ఓ కుర్రాడు "వుయ్ కెన్ అండర్ స్టాండ్ ఇంజనీరింగ్ ఇఫ్ ఈట్ ఈజ్ ఇన్ అవర్ మదర్ టంగ్, జై బాలయ్య" అని  చెప్పడంతో నా బుర్ర గిర్రున తిరిగి కోమా లోకి వెళ్ళిపోయింది. ఇంతలోనే ఆ జి. మొహం అప్పుడే "ఊ అంటావా, ఊ ఊ అంటావా" టాపిక్ కి వెళ్ళిపోయి మరో ప్రధాన వార్త మొదలుపెట్టింది.

అసలు ఈ తెలుగులో ఇంజనీరింగ్ బోధన సంగతి ఏమిటో తేల్చాలి అని గూగుల్ లో  ఎడా, పెడా వెతికితే "జగన్ కి కేంద్రం షాక్" అనీ, "ఇక తెలుగులో ఇంజనీరింగ్" అనీ కొన్ని కొన్ని వార్తలు కనపడ్డాయి. కావాలంటే  పత్రిక లో పడీన రెండు శీర్షికల ఫోటోలు ఇక్కడ పెట్టాను.




ఇవన్నీ చూశాక అవును పాపం మోదీ గారి చెవిలో పెద్ద పువ్వులే పెట్టారు అనిపించింది. కానీ ఆ పువ్వు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకి కూడా కావచ్చు. ఏమో!.

ఎందుకంటే...తెలుగులో ఇంజనీరింగ్ నేర్పడానికి ఏ కళాశాల అయినా ముందు "అఖిల భారత సాంకేతిక విద్య మండలి" (AICTE).. కి...అంటే మోదీ గారికి అప్లికేషన్ పెట్టుకోవాలి. తెలుగులో చెప్పగలిగిన లెక్చరర్లు ఉన్నారా లేదా వగైరా విశేషాలు అన్నీ పరిశీలించి వారు ఆ కళాశాలకి అనుమతి ఇస్తారు. ఆయా భాషలలో పాఠ్య పుస్తకాలు కూడా  ఆ

సాంకేతిక విద్య మండలి వారే ఇస్తారుట. ఇంకేం. ఇక తెలుగు బోధన భాషగా పూర్తిగా అయిదేళ్ళ ఇంజనీరింగ్ చదవవచ్చును. కదా!. కానీ నేను టీవీలో విన్న ప్రకారం, పైన పేపర్లో చదివిన వార్త ప్రకారం ఇక్కడ వేసిన ట్రిక్ ఏమిటంటే కావలసిన ట్రిక్కులు వేసి, ఆ సాంకేతిక విద్యామండలికి అంటే మోడీ గారికి నచ్చ చెప్పి అనుమతి తీసుకుని “అంతా ఉత్తిదే సార్..ముందు నాలుగు రోజులు నాలుగు తెలుగు మాటలు చెప్పేసి, మెల్లిగా ఇంగ్లీషు లోకి దిగిపోతాం. మీకేం భయం లేదు. మేము ఉన్నాంగా.” అని జగన్ గారికీ, కేసీఆర్ గారికీ అభయం ఇచ్చినట్టుగా నాకు కనపడింది. అనగా...మోడీ గారి చెవిలో పువ్వు. కదా!.

ఒక వేళ నేను టీవీలో విన్నదీ, కన్నదీ తప్పే అనుకుందాం. అంటే మొదటి సంవత్సరం 75 శాతం ఇంగ్లీషు సాంకేతిక పదాలతో తెలుగులో బోధన మొదలుపెట్టి, క్రమంగా తెలుగు వాడకాన్ని పెంచుతూ ఇంగ్లీషుని తగ్గిస్తారు అనే అనుకుందాం. అంటే త ఇంగ్లీష్ మీడియం నుంచి తెలుగు మీడియం కి వెళ్ళినట్టు కదా!. మరి అప్పుడు తెలుగు రాష్ట్రాలలో పీజీ నుంచి ఉన్నత పాఠశాల దాకా ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టి, తెలుగుని పక్కన పెట్టిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులలో ఒకరికి కాలీఫ్లవరూ, మరొకరికి కేబేజీ పెట్టినట్టే కదా!.

ఆ మాటకొస్తే పవిత్ర భారత దేశంలో, ముఖ్యంగా తెలుగు నాట ఇంత రసాభాస అవసరమా? ఒక వేపు స్థానిక భాషలోనే విద్యాబోధన జరగాలి అని మోడీ గారూ, అబ్బేబ్బే, మా వోటర్లు ఇంగ్లీషు కావాలంటున్నారు, తెలుగూ గిలుగూ నైజాంతా అని కేసీఆరూ, జగన్ గారూ ఇలా భాష బండిని రెండు వేపులు లాగుతున్నట్టా లేక తెలుగు బండి, ఇంగ్లీషు బండి, సంకర బండి అని మూడూ వేటికి అవేనా? ఈ చిక్కు ముడి తెగేటప్పటికి ఎన్ని తరాలు పడుతుంది? మాతృభాషకి, నెల, నెలా జీతం సంపాదించడానికీ మధ్య వేసిన లేనిపోని ఈ చిక్కుముడి ఎప్పుడు విడుతుంది? అలా విడదీసే దమ్మున్న తెలుగు నాయకుడు ఎవరు?

అసలు ప్రయాణం తెలుగు నుంచి ఆంగ్లానికా? ఆంగ్ల నుంచి తెలుగుకా? ఎక్కడ వేసిన గొంగళీ అక్కడేనా?

ఏది ఏమైనా నష్ట పోయేది ఎవరూ లేరు....ఒక్క తెలుగు భాషా, సాహిత్యాలు తప్ప. కానీ తెలుగు భాష తన దారి తనే వెతుక్కుంటుంది. తన తలుపులు తనే తెరుచుకుంటుంది. నాకు ఏమీ బెంగ లేదు. మరి మీకో?

**COMMENTS**